వాహనాలపై రవాణా శాఖ కొరడా

తిమ్మాపూర్, ఫిబ్రవరి 19: సరైన పత్రాలు లేకుండా రోడ్డుపై తిరుగుతున్న 25 వాహనాలపై రవాణాశాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. వాహనాల ఫిట్నెస్, ఆర్సీ, ఇన్సూరెన్స్, డ్రైవర్లకు లైసెన్స్‌లు లేకుండా రోడ్డుపై తిరుగుతున్న ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను రవాణా శాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి సీజ్ చేసి తిమ్మాపూర్‌లోని రవాణా శాఖ కార్యాలయానికి తరలించారు. రోడ్డుపై తిరిగే వాహనాలకు అన్ని పత్రాలు ఉండాలని సూచించారు. తనిఖీల్లో ఉమ్మడి జిల్లా రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

సైదాపూర్, ఫిబ్రవరి 19: రాయికల్ గ్రామంలో పురుగు మందుల వాడకంపై ఇన్ సెక్టిసైడ్స్ ఇండియా ట్రాక్టర్ బ్రాండ్ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పురుగు మందుల పిచికారీలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ రవీందర్‌రావు, సింగిల్ విండో డైరెక్టర్ చాడ ప్రకాశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కేడిక మధుకర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సంతోష్, రైతులు పాల్గొన్నారు.

23న ఉచిత వైద్య సేవలు

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 19: నగరంలోని సైన్స్ వింగ్ కాలేజీ ఎదురు వీధిలోగల శ్రీసత్యసాయి మందిరం ఆవరణలో ఈనెల 23న శ్రీసత్యసాయి సేవా సంస్థలు, కరీంనగర్ ఆధ్వర్యంలో ఉచిత రక్తనాళ సమస్యల వైద్య సేవల శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీసత్యసాయి సేవా సంస్థల ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పాల్తెపు లింగమూర్తి తెలిపారు. నగరంలోని మందిరంలో బుధవారం ఆయన మాట్లాడుతూ, ఏషియన్ వ్యాస్క్యులర్ హాస్పిటల్స్, హైదరాబాద్ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో వైద్య నిపుణులు రక్తనాళ సంబంధిత కలర్ డాప్లర్ టెస్టులు ఉచితంగా నిర్వహించి, వైద్యసలహాలు అందిస్తారని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం మూడు గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అపార్ నమోదు తప్పనిసరి

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 19: పాఠశాలల్లో అపార్ తప్పని సరిగా నమోదు చేయాలని ఎంఈవో కె. రవీందర్ తెలిపారు. బుధవారం నగునూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్ఎంల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ, విద్యార్థులు రోజూ విధిగా స్కూల్ యూనిఫాం, షూ వేసుకుని వచ్చేలా చూడాలని, తదితర సూచనలు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, ఫిబ్రవరి 19: విద్యుత్ తీగల కిందున్న చెట్ల కొమ్మల తొలగింపు, హెచ్‌టీ పనులు చేపడుతున్నందున 11కేవీ క్రిస్టియన్ కాలనీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాలకు గురువారం విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-1 ఏడీఈ పంజాల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు క్రిస్టియన్ కాలనీ, సివిల్ హాస్పిటల్ వెనుక ప్రాంతం, సీడీఆర్ హాస్పిటల్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

వీణవంక, ఫిబ్రవరి 19: రెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంబాల మధునమ్మ (91) చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్ఐ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. అంబాల మధునమ్మ ఈ నెల 12న ఇంటి వద్ద చలిమంటకాగుతుండగా ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పొట్టకింది భాగం కాలిపోయింది. కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తుండగా ఆరోగ్యం విషమించి ఈ నెల 18న సాయంత్రం మృతి చెందింది. మధునమ్మ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పేలుళ్లపై నివేదిక బహిర్గతం చేయాలి

కలెక్టరేట్, ఫిబ్రవరి 19: నగరంలోని వావిలాలపల్లి పరిధిలో గల ఓ ఇంటి సమీపంలో జరిగిన పేలుళ్లపై అధికారుల విచారణ నివేదిక బహిర్గతం చేయాలని సామాజిక కార్యకర్త శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు బుధవారం అర్బన్ తహసీల్దార్ నరేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొద్ది మాసాల క్రితం హన్‌మాన్ గుడి సమీపంలో గల రమాదేవి ఇంటి ఎదుట పేలుళ్లు జరుగగా, కొంతమంది కక్ష పూరితంగా ఈ చర్యకు పాల్పడినట్లు పోలీసులకు రమాదేవి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం విచారణ చేసినా ఎలాంటి నివేదిక ఇప్పటివరకు ఉన్నతాధికారులకు పంపలేదని చెప్పారు. బాధిత కుటుంబంపై వేధింపులు కూడా పెరిగినట్లు పేర్కొన్నారు. విచారణ నివేదిక బహిర్గతం చేస్తే, ఉన్నతాధికారుల వద్దకెళ్లి బాధితులు గోడు వెల్లబోసుకుంటారని, అధికారులు వెంటనే స్పందించాలని తహసీల్దార్‌కు అందజేసిన వినతిపత్రంలో కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

LOST

★ Rangu Mysaiah S/o. Rangu Chennaiah, H.No. 1-5/4, Cheerlavancha, Vemulawada mandal, Rajanna Sircilla Dist. My Passport No. V6985187 Lost by travelling If any body found please Cell. 6300566234.
NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ
- కలెక్టర్ పమేలా సత్పతి
- ఇంటర్, పదో తరగతి పరీక్షలపై సమన్వయ సమావేశం

మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 19 : వచ్చే నెలలో నిర్వహించనున్న ఇంటర్, పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పరీక్షల నిర్వహణపై బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ సారి ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి ఇంటర్ పరీక్షల పర్యవేక్షణ ఉంటుందన్నారు. చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవరికీ సెల్ ఫోన్ అనుమతి లేదని తెలిపారు. ప్రశ్న పత్రాలను కేంద్రాలకు తరలించే సమయంలో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఇతరులు ఎవరూ కూడా పరీక్షా కేంద్రాల్లో ఉండరాదని, గుర్తింపు పొందిన వారిని తప్ప ఎవరినీ కేంద్రాల్లోకి అనుమతించరాదని ఆదేశించారు. పరీక్షలు జరిగే తేదీల్లో ప్రత్యేక బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్ష వేళల్లో విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. విద్యార్థులు ఒత్తిడి, ఆందోళన, భయం లాంటి మానసిక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తే బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ నియమించిన మానసిక వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని, దీని కోసం టోల్ ఫ్రీ నంబర్ 14416 లేదా 1800 914416లో సంప్రదించాలని చెప్పారు. విద్యార్థులు గంట ముందు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోనికి అనుమతించరని స్పష్టం చేశారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, మార్చి 5 నుంచి 22 వరకు ఇంటర్ పరీక్షలు జరుగనున్నాయని తెలిపారు. ప్రథమ సంవత్సరం 17,799 మంది, ద్వితీయ సంవత్సరం 17,763 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. మొత్తం 58 సెంటర్లు ఏర్పాటు చేశామని కరీంనగర్‌లో 37 సెంటర్లు ఉన్నాయని వెల్లడించారు. జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు మాట్లాడుతూ, మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో 73 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొత్తం 12,516 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. సమావేశంలో పరీక్షల కమిటీ సభ్యులు ఆంజనేయ రావు, సత్యవర్ధన్ రావు, శశిధర్ శర్మ, హెచ్‌పీసీ మెంబర్ మధుమోహన్ రావు, డీఆర్‌వో వెంకటేశ్వర్లు, డీఎం హెచ్‌వో వెంకటరమణ, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఆధార్ పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి

కలెక్టరేట్, ఫిబ్రవరి 19 : 18 ఏండ్లు నిండిన వారి ఆధార్ నమోదుకు సంబంధించి తహసీల్దార్ల లాగిన్లలో ఉన్న పెండింగ్ దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. జిల్లాస్థాయి ఆధార్ నమోదు కమిటీ సమావేశం బుధవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాల విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేషన్ కోసం పాఠశాలల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలోని పలు అనాథాశ్రమాల్లో పెరుగుతున్న వారికి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌లో వచ్చే సమస్యలు పరిష్కరించాలని యూఐడీఏఐ డిప్యూటీ డైరెక్టర్ చైతన్యరెడ్డిని కోరారు. ఈ సమావేశంలో ఆయన వర్చువల్‌గా పాల్గొనగా, జిల్లాకు సంబంధించి నమోదు పూర్తయిన ఆధార్ గణాంకాలను సంబంధితాధికారులు వివరించారు. 5 నుంచి 15 ఏళ్లలోపు పిల్లల ఆధార్ బయోమెట్రిక్ తప్పనిసరి అప్‌డేట్ చేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి కె.సబిత, వైద్యాధికారి వెంకటరమణ, డీఈవో జనార్దన్‌రావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు, ఈడీఎం శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో స్పోర్ట్స్ ఒలింపియాడ్

- అక్రమ పద్ధతుల్లో ఏర్పడే సంఘాలకు మనుగుడ లేదు
- 2026లో ఖేలో ఇండియా యూత్ గేమ్స్
- తెలంగాణ ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి

మాట్లాడుతున్న ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి

కొత్తపల్లి, ఫిబ్రవరి 19: దేశ క్రీడా రంగంలో తెలంగాణను నంబర్‌వన్‌గా నిలిపేందుకు ఒలింపిక్ సంఘం కృషి చేస్తున్నదని, ఇందులో భాగంగా రాష్ట్రంలో క్రీడలను ప్రమోట్ చేసేందుకు ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం స్పోర్ట్స్ ఒలింపియాడ్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలంగాణ ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి పి. మల్లారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ జూడో క్రీడా సంఘ సమావేశానికి హాజరైన ఆయన, కాసేపు విలేకరులతో మాట్లాడారు. ఒలింపిక్ సంఘం గుర్తింపు ఉన్న సంఘాలకే మాత్రమే ప్రాతినిధ్యం ఉంటుందని, అక్రమ పద్ధతుల్లో ఏర్పడే సంఘాలకు మనుగడ లేదన్నారు. ఇటీవలి కాలంలో క్రీడా రంగంలో పలు క్రీడల్లో రెండు రెండు క్రీడా సంఘాలు ఏర్పడుతున్న క్రమంలో ఆయన ఈ విధంగా స్పందించారు. ఇటీవలి కాలంలోనే నూతన ఒలింపిక్ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైందని, ఏర్పాటైన కొద్దినెలల్లోనే తెలంగాణలో ఎన్నోమార్పులు తీసుకువచ్చినట్లు తెలిపారు. 2026లో తెలంగాణలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణకు తెలంగాణ ఒలింపిక్ సంఘం కృషి చేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణలో అకాడమీలను రద్దు చేసి స్పోర్ట్స్ స్కూల్స్ ప్రారంభించగా తిరిగి అకాడమీలను నెలకొల్పేందుకు, క్రీడాకారులకు న్యాయబద్ధంగా రావాల్సిన పారితోషికాలపై క్రీడా శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. క్రీడా సంఘాల మధ్య ఏర్పడుతున్న విభేదాలను పరిశీలించి, అన్ని క్రీడా సంఘాలను ఏకతాటిపై తీసుకువచ్చేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. క్రీడా సంఘాలకు, క్రీడాకారులకు మంచి రోజులురానున్నాయని, తెలంగాణ క్రీడాకారులు ఒలింపిక్ స్థాయిలో పతకాలు సాధించే క్రీడాకారులుగా తయారుకావాలన్నారు.

రికార్డు సృష్టించిన రేకుర్తి కంటి దవాఖాన

- ఒకే రోజులో 109 కంటి ఆపరేషన్లు

విద్యానగర్, ఫిబ్రవరి 19 : రేకుర్తిలోని లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ భాస్కర్ మడేకర్ నేత్ర వైద్యశాలలో బుధవారం ఒక్కరోజే 109 ఆపరేషన్లు నిర్వహించి రికార్డు సృష్టించారు. హాస్పిటల్‌లో వారంలో రెండు రోజులు ఉచితంగా, ఒకరోజు వాకిన్ ఫ్రీ, ఒక రోజు రెఫరల్ పేషెంట్లకు, వారంలో నాలుగు రోజులు ఉచితంగా పేదలకు కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. డబ్బులు పెట్టి కంటి ఆపరేషన్ చేసుకునే వారికి అత్యాధునికమైన పరికరాలతో చాలా తక్కువ ఖర్చుతో కంటి ఆపరేషన్లు చేస్తున్నామని చైర్మన్ కొండా వేణుమూర్తి తెలిపారు.

మున్సిపల్ అభివృద్ధి పనులపై ప్రత్యేకాధికారి సమీక్ష

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 19: హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని అభివృద్ధి పనులపై బుధవారం అదనపు కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేకాధికారి ప్రఫుల్ దేశాయ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపల్ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, ఆస్తి, నల్లా పన్నులు, ట్రేడ్ లైసెన్స్, షాపుల కిరాయి వసూళ్ల గురించి అడిగి తెలుసుకున్నారు. మార్చి 31లోగా పురపాలక సంఘానికి బకాయి ఉన్న పన్నులు వసూలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ కెంసారపు సమ్మయ్య, తహసీల్దార్ కే కనకయ్య, మేనేజర్ ఆర్. భూపాల్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ అశ్వినీ గాంధీ, ఇంచార్జ్ ఏఈ సాంబరాజు, సీనియర్ సహాయకులు రషీద్, జే శ్రీకాంత్, వార్డు అధికారులు, శానిటరీ జవాన్లు ఆర్. సుధీర్, తూముల కుమార్ పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన

విద్యానగర్, ఫిబ్రవరి 19: కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం పేయింటింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మందికి హాస్పిటల్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగరాజు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి షుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు నిర్వహించి రోగనిర్ధారణ చేశారు. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ.. పేయింటింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలందించాలనే ఉద్దేశంతోనే ఈ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. మెడికవర్ హాస్పిటల్‌లో 24 గంటల పాటు సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. శిబిరంలో జిల్లా పేయింటింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు చడా ఆనంద్, హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, సంతోష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

గంగాధర, ఫిబ్రవరి 19 : కరీంనగర్ మార్క్‌ఫెడ్, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో గంగాధర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని డీసీఎంఎస్ ఏబీఎం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన కందులను కొనుగోలు కేంద్రంలో అమ్మి మద్దతు ధర రూ.7,550 పొందాలని సూచించారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జి నర్సింగరావు, మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ లక్ష్మణ్, సిబ్బంది తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం అదనపు బస్సులు నడపాలి

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 19: మార్చి నెలలో జరిగే ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల కోసం అదనపు బస్సులు నడపాలని 30వ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసరి మధుకర్ రావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకంతో బస్సుల్లో రద్దీ పెరుగడం వల్ల విద్యార్థులు బడులు, కాలేజీలకు వెళ్లేందుకు ఆలస్యమవుతున్నదని తెలిపారు. రద్దీ దృష్ట్యా, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థుల కోసం అదనపు బస్సులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

తెగుళ్ల నివారణపై అవగాహన

గంగాధర, ఫిబ్రవరి 19 : మండలంలోని నారాయణపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో రైతులు సాగు చేసిన వరి పొలాలను జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. వరిలో చౌడు, జింక్ లోపం నివారణ, తడిపొడి పద్ధతులు, కాంప్లెక్స్ ఎరువుల వాడకం, అగ్గి తెగులు, మొగి పురుగు నివారణ వంటి వాటి గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్, ఏడీఏ ప్రియదర్శిని, ఏవో శ్రీనివాస్, ఏఈవో రమ్య, రైతులు పాల్గొన్నారు.

జిల్లా సైన్స్ మ్యూజియం సందర్శించిన

చొప్పదండి, ఫిబ్రవరి 19: అర్నకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం జిల్లా కేంద్రంలోని సైన్స్ మ్యూజియం సందర్శించారు. మ్యూజియంలోని అన్ని ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారని, ఖగోళశాస్త్రంలోని ప్లానిటోరియం విద్యార్థులను ఎంతో ఆకర్షించిందని మండల విద్యాధికారి దీక్షితుల శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజమౌళి, హరిత, శ్రీకాంత్, ఉమారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.


గంగాధర: గట్టుభూత్కూర్‌లో శివాజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు, యువకులు

ఘనంగా శివాజీ జయంతి

వీణవంక/ సైదాపూర్/ గంగాధర/హుజూరాబాద్ టౌన్/చొప్పదండి, ఫిబ్రవరి 19: ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా విశ్వ హిందూ పరిషత్, వివిధ యూత్ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సైదాపూర్ మండలకేంద్రంతో పాటు ఆరెపల్లి, గంగాధర మండలం గట్టుభూత్కూర్ గ్రామంలో గణేశ్ యూత్ ఆధ్వర్యంలో శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీణవంక మండలం హిమ్మత్‌నగర్‌లో ఆరె సంఘం నాయకులు కేక్‌కట్ చేసి, స్వీట్లు పంచారు. హుజూరాబాద్ పట్టణంలోని 27వ వార్డు, ఆరెవాడ, అహల్య నగర్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహానికి, చిత్రపటానికి ఆరె కులస్తులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చొప్పదండి పట్టణంలోని తెలంగాణ చౌరస్తా వద్ద విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

రాష్ట్రస్థాయి పురస్కారానికి డాక్టర్ అంజనీ దేవి ఎంపిక

డాక్టర్ అంజనీ దేవి

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 19: అస్తిత్వం సేవా సంస్థ, తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో అందించే రాష్ట్ర స్థాయి భాషా సాంస్కృతిక పురస్కారానికి పట్టణానికి చెందిన డాక్టర్ దివిటి అంజనీ దేవి ఎంపికయ్యారు. ఈనెల 21న హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరుగనున్న కార్యక్రమంలో ఆమె అవార్డు అందుకోనున్నారు. సమ్మక్క, సారలమ్మ జాతర సాహిత్య సాంస్కృతిక అంశాలపై పరిశోధన చేసి 2003లో కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం నుంచి అంజనీ దేవి డాక్టరేట్ పట్టా పొందారు. భాషా సాహిత్యానికి ఆమె అందించిన సేవలకు గానూ రాష్ట్ర ప్రభుత్వం, అస్తిత్వం సేవా సంస్థ అవార్డుకు ఎంపిక చేసింది.

సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

సమావేశానికి హాజరయ్యే ముందు రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి

బీఆర్ఎస్ సమావేశంలో మనోళ్లు

కరీంనగర్ కార్పొరేషన్, ఫిబ్రవరి 19: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన బుధవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదు, సిల్వర్ జూబ్లీ వేడుకలు, పార్టీ సంస్థాగత ఎన్నికలపై చర్చించారు. భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశానికి జిల్లా నుంచి మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, వొడితల సతీశ్‌కుమార్, నాయకులు హాజరయ్యారు.

ఉద్యోగులు అడుక్కునే దుస్థితి ఎందుకొచ్చింది?

కాంగ్రెస్ ప్రభుత్వం వేధిస్తున్నది • ఏ ఒక్క వర్గమూ సంతోషంగా లేదు • కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

కరీంనగర్ విద్యానగర్, ఫిబ్రవరి 19: తెలంగాణ కోసం తెగించి కొట్లాడిన ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇవాళ జీతభత్యాలు, సమస్యల పరిష్కారం కోసం అడుక్కునే దుస్థితి ఎందుకొచ్చిందో ఆలోచించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సూచించారు. డీఏలు, పెండింగ్ బిల్లులతోపాటు జీపీఎఫ్ దాచుకున్న సొమ్మును కూడా ఇవ్వకుండా ప్రభుత్వం వేధిస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉద్యోగులు సహా ఏ ఒక్కవర్గమూ సంతోషంగా లేదని చెప్పారు. ఉపాధ్యాయ సంఘం తపస్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని సీతారాంపూర్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన అధ్యాపక, ఉపాధ్యాయ ఆత్మీయ సమ్మేళనంలో బండి సంజయ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ సాధనలో రాజకీయ పార్టీల పాత్ర ఎంత ఉన్నదో.. ఉద్యోగ, ఉపాధ్యాయుల పాత్ర అంతకంటే ఎక్కువే ఉన్నదని ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వం క్రమం తప్పకుండా ఉద్యోగులకు డీఏలిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆ ఊసే ఎత్తడం లేదని, నాలుగు డీఏలు పెండింగ్‌లో పెట్టిందని, ఆఖరికి మీ జీతం పైసల్లోంచి దాచుకున్న జీపీఎఫ్, గ్రాట్యుటీ పైసలు కూడా ఇవ్వకుండా సతాయిస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై సొంత పార్టీ ఎమ్మెల్యేల్లోనే అసంతృప్తి రగులుతున్నదని చెప్పారు. ప్రభుత్వంలోనూ లుకలుకలు మొదలయ్యాయని, సొంత పార్టీ ఎమ్మెల్యేలు అసమ్మతి పేరుతో రహస్య సమావేశాలు నిర్వహించుకుంటున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి నూకలు చెల్లే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలపై త్వరలోనే అనర్హత వేటు పడటం తథ్యమన్నారు.

నిరంతర నీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలి

కార్పొరేషన్, ఫిబ్రవరి 19: నగరంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ రిజర్వాయర్ పరిధిలో పైలెట్ ప్రాజెక్టు కింద చేపడుతున్న 24 గంటల నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని హౌసింగ్ బోర్డు, మారుతీ నగర్ ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. అనంతరం హౌసింగ్ బోర్డు రిజర్వాయర్‌లో స్మార్ట్ సిటీ, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, ఏజెన్సీ కాంట్రాక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్